సాక్షి సంగారెడ్డి

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



గుట్టలకు పట్టాలు!

రెవెన్యూ అధికారులు అసైన్డ్ పట్టాల పంపిణీలోని లోపాలను ఆసరా చేసుకొని కొందరికి గుట్టల భూములకు అసైన్డ్ పట్టాలను ఇచ్చారు.

వివరాలు 8లో ▸



విద్యతోపాటు విజ్ఞానం

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం, రాయడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. వివరాలు 8లో ▸



'ఉపాధి హామీ' అక్రమాలు

ఉపాధిహామీ పథకంలో పనులు చేయకున్నా హాజరు వేసి డబ్బులు దుర్వినియోగం చేశారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

భూసార పరీక్షలు చేయించుకోవాలి

డీఏఓ శివప్రసాద్



రైతులకు భూసార పరీక్షల పత్రాలు అందజేస్తున్న డీఏఓ శివప్రసాద్

కల్హేర్(నారాయణఖేడ్): భూసార పరీక్షలు చేయించుకుంటే పంట సాగులో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శివప్రసాద్ సూచించారు. మంగళవారం కల్హేర్ రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. నాగధర్, కృష్ణాపూర్, మార్డి, మాసాన్‌పల్లి, మహదేవుపల్లి గ్రామాలకు చెందిన రైతులకు భూసార పరీక్షల పత్రాలు అందజేశారు. పంట కోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కలిపించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాహుల్, ఏడీఏ నూతన్‌కుమార్, ఎఈఓలు సంతోష, కృష్ణావేణి, ప్రతిభ, వంశీవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒత్తిడి లేని జీవనం సాగించాలి

మహిళా సంక్షేమాధికారిణి లలితకుమారి

నారాయణఖేడ్: ఒత్తిడి లేకుండా జీవనం సాగిస్తేనే గర్భిణిలు ఆరోగ్యంగా ఉంటూ సుఖవంతమైన ప్రసవం పొందగలుగుతారని జిల్లా మహిళా సంక్షేమాధికారిణి లలితకుమారి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లో రామకృష్ణ మఠం, ఇంపాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని 300 మంది గర్భిణిలకు మెరుగైన ఆరోగ్యం గురించి అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణులుగా ఉన్న సమయంలో పౌష్టికాహారంతో పాటు ఒత్తిడి లేకుండా ఉండాలన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఆర్యజనని టీం సభ్యులు దీప్తి, నిహారిక, మాధవిలు గర్భిణిలకు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో బ్రహ్మాజీ, ఐసీడీఎస్ బాధ్యులు సుజాత, ఇంపాక్ట్ నారాయణఖేడ్ ఇన్‌చార్జి సంతోష్ కుమార్. క్లబ్ అధ్యక్షురాలు శ్వేత, సభ్యులు లావణ్య, స్వాతి, అపర్ణ, సంధ్యా, లక్ష్మి, వర్ష, సరిత, రాధిక, హేమలత, ఉజ్వల, అంగన్వాడీ టీచర్లు, సూపర్ వైజర్లు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

మునిపల్లి(అందోల్): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ క్రమ శిక్షణ కలిగి ఉండాలన్నారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బాగోగులను చూడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయ సహాయం అవసరమైతే సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కాగా, కంకోల్ బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజన వసతుల వివరాలను వార్డెను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

సదాశివపేట(సంగారెడ్డి): ఐఐటీ-జేఈఈ నీట్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మంగళవారం ఎస్పీ రూపేష్ పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సదాశివపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల కరస్పాండెంట్ రఘువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రణీత, వైస్ ప్రిన్సిపాల్ సంజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఉమామహేశ్వరరావు



జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఉమా మహేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన జి.శ్రీనివాస్‌రెడ్డి మెదక్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావు వచ్చారు. నూతన కమిషనర్‌ను మున్సిపల్ సిబ్బంది సత్కరించారు.

పరిశ్రమలకు సర్కార్ సహకారం

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- దామోదరతో కలసి వెబ్‌నార్‌లో పాల్గొన్న మంత్రి

పటాన్‌చెరు: పరిశ్రమలకు పూర్తి సహకారం అందిస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అమీన్‌పూర్ పరిధిలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కు ఎస్ఎంటీ పరిశ్రమలో ప్రధాని నరేంద్ర మోదీ వెబ్‌నార్ ద్వారా ప్రారంభించిన అయుష్మాన్ భారత్ పీఎం జన్ ఆరోగ్య యోజన కార్యక్రమంలో వైద్యాఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సుల్తాన్‌పూర్ ఎస్ఎంటీ పరిశ్రమలో అంతర్జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలతో స్టంట్లు, గుండె సంబంధిత పరికరాలు తయారు చేస్తారన్నారు. ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ఈ స్టంట్లను అందుబాటులోకి తీసుకొచ్చారని, 60 శాతం వరకు మరింత మార్కెట్ పెంచుకోవాలని లక్ష్యంతో ఈ పరిశ్రమ పనిచేస్తుందని చెప్పారు. ఇలాంటి పరిశ్రమలు మరిన్ని రావాలని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు.



ప్రధాని మోదీ వెబ్‌నార్‌లో పాల్గొన్న మంత్రులు దామోదర, శ్రీధర్ బాబు

తిరిగొచ్చేశారు!

మెదక్, సంగారెడ్డి జిల్లాలు వారికి కొట్టిన పిండి.. ఏ గ్రామంలో ఏ భూములు ఉన్నాయి.. విలువైన ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి.. వాటి పుట్టు పూర్వోత్తరాలు ఏంటీ.. ఇలా అన్నీ తెలిసిన అధికారులు వారు. వివిధ కారణాలతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఆ 'రెవెన్యూ'ఉన్నతాధికారులు.. ఇప్పుడు తిరిగి ఇదే జిల్లాలకు వచ్చేశారు. సోమవారం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలువురు రెవెన్యూ ఉన్నతాధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు.. ఇలా ఆయా క్యాడర్‌లో అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ బదిలీల్లో మెదక్, సంగారెడ్డి జిల్లాలకు బదిలీపై వచ్చిన ఉన్నతాధికారులంతా గతంలో ఇక్కడ పనిచేసిన వారే కావడం గమనార్హం. తమకు పూర్తి స్థాయిలో 'పట్టున్న'ప్రాంతానికే వీరికి పోస్టింగ్‌లు దక్కడం ఇప్పుడు రెవెన్యూశాఖలో చర్చనీయాంశంగా మారింది.

-సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

'పట్టున్న'ప్రాంతానికే తిరిగి పోస్టింగ్

- బదిలీపై వచ్చిన వారంతా గతంలో ఇక్కడ పని చేసిన వారే
- ఇక్కడి భూములు, వాటి రికార్డులపై పూర్తి అవగాహన
- చర్చనీయాంశంగా 'రెవెన్యూ'పోస్టింగ్‌లు



నగేష్

సుమారు దశాబ్ద కాలంగా ఇక్కడే..

మెదక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా మెంచు నగేష్ నియమితులయ్యారు. వనపర్తి అదనపు కలెక్టర్ ఉన్న ఆయన తాజా బదిలీల్లో మెదక్‌కు వచ్చారు. నగేష్ సుమారు దశాబ్దం కాలంగా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పనిచేశారు. డిప్యూటీ తహసీల్దార్ నుంచి మొదలుకొని తహసీల్దార్‌గా.. మెదక్ జిల్లాలో పలు మండలాల్లో పనిచేశారు. మెదక్ ఆర్డీఓగా, సంగారెడ్డి ఆర్డీఓగా కూడా చేశారు. అలాగే సంగారెడ్డి డీఆర్ఓ (జిల్లా రెవెన్యూ అధికారి)గా కూడా ఉన్నారు. చాలా ఏళ్లు సంగారెడ్డి ఆర్డీఓగా విధులు నిర్వర్తించిన ఆయనకు.. పటాన్‌చెరుతో పాటు, హెచ్ఎండీఏ పరిధిలోని మండలాల్లోని భూములపై మంచి పట్టుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇక్కడి నుంచి వనపర్తికి బదిలీపై వెళ్లిన నగేష్.. కొన్ని నెలల్లోనే తిరిగి మెదక్‌కు చేరుకోవడం ఇప్పుడు రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



రాంరెడ్డి

ఇక్కడ పనిచేసిన వారే..

మహబూబ్‌నగర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.రాంరెడ్డి జహీరాబాద్ ఆర్డీఓగా నియమితులయ్యారు. ఈ అధికారి కూడా గతంలో ఇక్కడ పనిచేసిన వారే కావడం గమనార్హం. సదాశివపేట తహసీల్దార్‌గా పని చేశారు. అలాగే మరో రెండు మండలాల్లో ఆయన విధులు నిర్వర్తించారు. ఇప్పుడు ఆయన జహీరాబాద్ ఆర్డీఓగా నియమితులయ్యారు. ఇలా జిల్లాలో, ఆయా స్థానాల్లో పనిచేసిన ఇతర జిల్లాలకు, మరోచోటుకు వెళ్లిన అధికారులంతా తిరిగి వారికి పట్టున్న ప్రాంతాలకే రావడం పట్ల చర్చనీయాంశమైంది.



రవీందర్‌రెడ్డి

అలా వెళ్లి.. ఇలా వచ్చారు

సంగారెడ్డి ఆర్డీఓగా పనిచేసి బదిలీపై వెళ్లిన రవీందర్‌రెడ్డి ఇలా వెళ్లి.. అలా వచ్చేశారు.. కొన్ని నెలల వ్యవధిలోనే తిరిగి ఆయనకు సంగారెడ్డి పోస్టింగ్ ఇచ్చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన సంగారెడ్డి ఆర్డీఓగానే ఉన్నారు. ఆ తర్వాత కొన్ని నెలలకే జహీరాబాద్ నిమ్జ్ భూసేకరణ విభాగానికి బదిలీ అయింది. ఇక్కడ ఆరేడు నెలలు కూడా గడవక ముందే తిరిగి సంగారెడ్డి ఆర్డీఓగా నియమితులయ్యారు.

'పటాన్‌చెరు'లో మహిపాల్



హైదరాబాద్ ఆర్డీఓగా ఉన్న మహిపాల్ నర్సాపూర్ ఆర్డీఓగా నియమితులయ్యారు. ఈయన కూడా గతంలో ఇక్కడ పని చేసిన వారే కావడం గమనార్హం. పటాన్‌చెరు తహసీల్దార్‌గా చాలా ఏళ్లుగా కొనసాగారు. పటాన్‌చెరు మండల పరిధిలోని విలువైన భూములు, వాటి రికార్డులపై పూర్తి అవగాహన ఉంది. అక్కడి నుంచి ఆయన సంగారెడ్డి కలెక్టరేట్ పరిపాలన అధికారిగా వచ్చారు. ఇక్కడి నుంచి నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయింది. అక్కడి నుంచి హైదరాబాద్ ఆర్డీఓగా వెళ్లారు. ఏడాది కూడా తిరగక ముందే ఆయన ఆర్డీఓగా నర్సాపూర్‌కు చేరుకోవడం గమనార్హం.

ఇంటింటి సర్వేకు ఏర్పాట్లు

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

- 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్
- సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం క్షేత్రస్థాయిలో విస్తృత ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. మంగళవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు అధికారులు హాజరయ్యారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లక్ష్యాలు, విధివిధానాలు, కార్యాచరణ గురించి వివరించారు. సర్వే విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన ఈ కార్యక్రమంలో అందరిని భాగస్వాములు చేయాలన్నారు. 2011 జనాభా గణన అనుసారంగా ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని, కొత్తగా ఏర్పడిన కాలనీలు ఉంటే బ్లాక్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. 150 కుటుంబాలకు ఒకరు చొప్పున ఎన్యుమరేటర్లకు నియమించాలని, పది మంది ఎన్యుమరేటర్లకు ఒకరు చొప్పున సూపర్వైజర్లను సర్వే ప్రక్రియ పర్యవేక్షణ కోసం గుర్తించాలని కోరారు. ఏ ఒక్క కుటుంబం సైతం మినహాయించకుండా ప్రతి ఎన్యుమరేషన్ బ్లాక్‌లో ఇంటింటి సర్వే జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రణాళిక శాఖ ఈ సర్వేకు నోడల్ విభాగంగా వ్యవహరిస్తుందని, క్షేత్రస్థాయిలో ప్రతి మండలానికి ఒక నోడల్ ఆఫీసర్‌గా జిల్లా స్థాయి అధికారిని నియమించాలని, అదనపు కలెక్టర్ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరించాలని, సర్వే విజయవంతానికి కలెక్టర్ పర్యవేక్షించాలని ఆదేశించారు. సర్వే కోసం వెళ్లిన సమయంలో ఎన్యుమరేటర్లు హుందాగా వ్యవహరించాలని, సర్వే ప్రధాన ఉద్దేశ్యాన్ని తెలియజేయాలని, ప్రశ్నావళికి అనుగుణంగానే సమాచారం సేకరణ జరపాలన్నారు. సేకరించిన వివరాలు గోప్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో తప్పిదాలు, లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని, సకాలంలో ఈ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జెడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సీపీఓ బాలశౌరి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

దొడ్డు ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

- షరతులు లేకుండా కొనుగోలు చేయాలి
- ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సన్న రకం వరి ధాన్యంతో పాటు దొడ్డు రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హత్నూర మండలం రొయ్యపల్లి, నాగారం, పల్పనూర్, బోరుపట్ల, సాదులనగర్, గుండ్లమాచనూరు, తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం దొడ్డు బియ్యంకు సైతం బోనస్ ఇవ్వాలని చెప్పారు. ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తేమ శాతం పేరుతో రైతులను వేధిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు గన్ని బ్యాగులు సుతిలి తాడులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, కార్మిక సంక్షేమ బోర్డు రాష్ట్ర మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింలు, సొసైటీ సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి తదితరులు

సంగారెడ్డి జోన్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో కల్పించాల్సిన రిజర్వేషన్లపై బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టింది. బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి సంగారెడ్డికి కమిషన్ రానుంది. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నేతృత్వంలో బృందం సభ్యులు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, ఆయా సంఘాల నేతలు హాజరుకానున్నారు.

'స్థానికం'పై అభిప్రాయ సేకరణ

- నేడు సంగారెడ్డికి బీసీ కమిషన్ బృందం రాక
- హాజరుకానున్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, బీసీ సంఘాల నేతలు

- త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లు, దామాషా వివరాలు, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నారు. కాగా, కమిషనర్ బృందం రాక సందర్భంగా కలెక్టరేట్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. సూచనలు సలహాలు అందించేందుకు అధికారులతో హెల్ప్ డెస్క్ సౌకర్యం, రిజిస్ట్రేషన్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు.
- అభిప్రాయాలు చెప్పాలనుకునే ఆసక్తి గలవారు రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను నేరుగా కమిషన్‌కు అందించే వీలు ఉంటుంది. అదేవిధంగా నిర్దేశిత నమూనా వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లు తెలుగు లేదా ఇంగ్లిష్‌లో అందించాల్సి ఉంటుంది.
- అభిప్రాయాలను స్వీకరించేందుకు ప్రత్యేకంగా టేబుళ్లను ఏర్పాటు చేసి, అవసరం మేరకు సిబ్బందిని నియమించనున్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అభిప్రాయాలను సేకరించనున్నారు. సాయంత్రం 4:30 నిమిషాలకు కమిషన్ బృందం సభ్యులు వివరాలు మీడియాకు వెల్లడించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్వర్ సమీక్ష నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గంజాయిపై ఉక్కుపాదం

- సాగు, రవాణా చేసినా చర్యలు తీసుకోండి
- అధికారులకు ఎస్పీ రూపేష్ ఆదేశం

సంగారెడ్డి జోన్: గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా ఉక్కుపాదం మోపాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ (అండర్ ఇన్వెస్టిగేషన్)లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు అండగా నిలవాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులలో నిందితులను కోర్టులో ప్రవేశపెట్టి సైబర్ బాధితులు కోల్పోయిన, హోల్డ్ చేయబడిన డబ్బు తిరిగి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రగ్స్, ఆన్‌లైన్ మోసాల గురించి జిల్లా ప్రజలలో, విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

సంగారెడ్డి : ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అని, ర్యాగింగ్‌కు పాల్పడి చట్టం ముందు నిందితులుగా నిలవవద్దని ఎస్పీ చెన్నూరి రూపేశ్ మెడికల్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం సంగారెడ్డి మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ సెన్సిటైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ అనేది చట్టరీత్యా నేరం, ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడినట్లయితే శిక్షార్హులవుతారన్నారు. కొంతమంది విద్యార్థులు ర్యాగింగ్ చేస్తూ తోటి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి వారి సమాచారాన్ని నిర్భయంగా జిల్లా పోలీస్ షీటీం నంబర్ 87126-56772, ఎస్-నాబ్ 87126-56777 లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపుతోందన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా నార్కోటిక్ అనాలసిస్ బ్రాంచ్ ను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి వంటి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దన్నారు. విద్యార్థినీ విద్యార్థులు మొదటగా చదువుపై దృష్టి సారించాలన్నారు. నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధామాధురి, సూపరింటెండెంట్ అనిల్ కుమార్, మెడికల్ కళాశాల ప్రొఫెసర్స్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ తగదు

సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్: టౌన్ షిప్ అభివృద్ధి పేరిట పేదల భూములు లాక్కోవడం తగదని సీపీఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. పెద్దకంజర్ల గ్రామం రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తున్న బలవంతపు భూసేకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేఏరకు ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మంగళవారం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పెద్దకంజర్లలో గత ప్రభుత్వం రైతుల నుంచి ఇరవై ఎకరాలను టౌన్‌షిప్ అభివృద్ధి పేరుతో భూసేకరణ చేసిందన్నారు. ఎకరాకు 15 లక్షల 75 వేల రూపాయలను ప్రకటించి, దాదాపు 100 మంది రైతులకు నష్టపరిహారం నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ అధికారులు వచ్చి రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, వారి చర్యల వలన రైతులు తమ విలువైన భూములను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 300 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు జంగయ్య, ముత్యాలు, నర్సింలు, దుర్గయ్య, నగేష్ నాగభూషణం పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

సిద్దిపేటజోన్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విధిషలో నవంబర్ 8 నుంచి 12 వరకు జరగనున్న జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీలకు సిద్దిపేట విద్యార్థిని పురంధర ఎంపికైంది. 26 నుంచి 28 వరకు వికారాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు తెలిపారు. మెరీడియన్ పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి అభినందించారు.

భూ తగాదాలో ఇరు వర్గాలపై కేసు

నిజాంపేట(మెదక్): భూ తగాదాలో ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నిజాంపేట గ్రామానికి చెందిన బత్తుల శ్రీరాములు, బత్తుల వెంకట్, బత్తుల అర్జున్ ముగ్గురు అన్నాదమ్ముళ్లు. వీరికున్న వ్యవసాయ భూమి విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతుండగా సోమవారం ఒకరినొకరు గొడవపడి కట్టెలతో కొట్టుకున్నారు. అనంతరం బత్తుల లక్ష్మీప్రసన్న, బత్తుల వెంకటేశం ఇరువురు పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఇందులో శ్రీరాములు, అర్జున్, వెంకటేశ్‌లకు గాయాలు కావడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

కమీషన్ పేరుతో సైబర్ మోసం

రూ.1.48 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: టాస్కులు కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి భారీగా నగదు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం కట్ట పోచారం గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి టాస్కులు, కమీషన్ పేరుతో సెప్టెంబర్ 28న మెసేజ్ వచ్చింది. ఉద్యోగి తన వివరాలను నమోదు చేయగా నిర్వాహకులు ఓ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. టాస్కులు పూర్తి చేస్తే పెట్టిన నగదుతోపాటు కమీషన్ వస్తుందని చెప్పి నమ్మించడంతో ఉద్యోగి పలు దఫాలుగా రూ.1.48 లక్షలు వేశాడు. పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పాము కాటుతో బాలుడు మృతి



చింటు(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన సిర్గాపూర్ మండలంలోని తోల్యా తండాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన గోవింద్ కుమారుడు చింటు(11) తల్లిదండ్రులతో కలిసి పత్తి తీసేందుకు చేనుకు వెళ్లాడు. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమై ఉండగా బాలుడిని పాము కాటు వేసింది. వెంటనే తల్లిదండ్రులకు తెలుపగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

వ్యక్తి అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: వ్యక్తి అదృశ్యమైన ఘటన సంగారెడ్డి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి టౌన్ సీఐ భాస్కర్ కథనం మేరకు.. నారాయణఖేడ్ మండలం, చందాపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు కామిని శారద, అంజయ్య బతుకుదెరువు కోసం సంగారెడ్డికి వచ్చి శాంతినగర్‌లో కూలీ పనులు చేసుకుటూ నివాసం ఉంటున్నారు. అంజయ్య తండ్రి రామయ్య(40) రోజులాగే మందుతాగి ఇంటికి రావడంతో మందలించారు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుట్టలకు పట్టాలు!

15 ఎకరాలు స్వాహా

- అసైన్డ్ పట్టాలకు అధికారుల సహకారం
- సాగుకు పనికిరాని రాళ్లకు పట్టాదారు పాస్ పుస్తకాలు
- ప్రతీయేటా రైతు బంధు, బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటున్న వైనం
- కుంటల శిఖం భూములు సైతం ఆక్రమణ



నాగారం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం వ్యవసాయ ఆధారిత పంటలను సాగు చేసుకోవడానికి సీలింగ్ చట్టం పరిధిలో మిగులు భూములకు అసైన్డ్ పట్టాలను పంపిణీ చేసింది. రెవెన్యూ అధికారులు అసైన్డ్ పట్టాల పంపిణీలోని లోపాలను ఆసరా చేసుకొని కొందరు పైరవీ కారులకు జిల్లెలగడ్డ, మీర్జాపూర్, నాగారం, ఉమ్మాపూర్ గ్రామాల్లో ఒక్కొక్కరి 0.20 గుంటలు మొదలు 2.38 ఎకరాల వరకు గుట్టల భూములకు అసైన్డ్ పట్టాలను ఇచ్చారు. దాదాపు ఆయా గ్రామాల్లో 20 మంది 15 ఎకరాల వరకు అక్రమంగా అసైన్డ్ పట్టాలను పొందినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. భూములను సాగు చేయకపోయినా ప్రభుత్వం ఇచ్చే రైతు బంధుతోపాటు బ్యాంకులో పంట రుణాలను పొందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బోగస్‌కు ధరణిలో క్రమబద్ధీకరణ..

హుస్నాబాద్ డివిజన్ పరిధి ఉమ్మాపూర్ శివారులోని సర్వే నంబర్ 142, నాగారం శివారులో సర్వే నంబర్ 54లో మీర్జాపూర్, జిల్లెలగడ్డ, పోతారం(ఎస్) గ్రామాల సరిహద్దు భూములు ఉన్నాయి. ఉమ్మాపూర్ శివారు భూముల్లో గుట్టలు ఉండటంతో ఇటువైపు ఎవరూ కన్నెతి చూడరని కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో గుట్టల భూములకు పట్టా పాసు పుస్తకాలను సృష్టించారు. ప్రభుత్వం తెచ్చిన ధరణీ భూ రికార్డుల ప్రక్షాళనలో బోగస్ పట్టాలను గుర్తించి రెవెన్యూ అధికారులు మొదట తిరస్కరించినా డబ్బులను ఎరచూపి చివరికి ధరణీ పట్టా పాసు పుస్తకాలను కూడా పొందారు. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే సీలింగ్ యాక్ట్ కింద పేదలకు అసైన్డ్ పట్టాలు ఇస్తారని గుట్టలకు పట్టాలు ఎవరు ఇచ్చారని ప్రస్తుత రెవెన్యూ అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కుంటల శిఖం భూములు కబ్జా

హుస్నాబాద్ మండలంలోని మంచీళ్ల కుంట శిఖం 8.34 ఎకరాలు ఉంటే ప్రస్తుతం అక్కడ కట్టనే మిగిలింది. మీర్జాపూర్, తోటపల్లి శివారు పరిధిలోని వట్టి కుంట, వైదేరు కుంటల శిఖం భూములు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. పోతారం(ఎస్), పొట్లపల్లి, తోటపల్లి గ్రామాల్లో కూడా ఊరు శివారు కుంటలు ఆక్రమణకు గురైనట్లు ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్, సబ్ కెనాల్ కాల్వలకు ఇటీవల రెవెన్యూ అధికారులు భూ సర్వే చేసి అవార్డు కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. భూసేకరణ పూర్తి అయితే కాల్వల పనులు పూర్తి చేసి చెరువు, కుంటలకు నీళ్లు వదులుతారు. గ్రామాల్లో కుంటలు కనుమరుగు కావడంతో నీళ్లు ఎక్కడకు చేరుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టర్ స్పందించి గుట్టల భూములకు పట్టాలపై విచారణ జరిపించి అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములు ఇవ్వాలని కోరుతున్నారు.

విచారణ చేయాలి



మా ఊరు మంచీళ్ల కుంట 8.43 ఎకరాల భూమి మొత్తం కబ్జా చేసింద్రు. మీర్జాపూర్ గుట్టలు సాంఘీక సంక్షేమ గురుకులం దగ్గర గుట్టల భూమికి పట్టాలు తీసుకున్నట్లు కొందరు చెబుతున్నారు. అక్కడే అమ్మవారి దేవాలయం నిర్మాణానికి భూమి ఇచ్చారు. గుట్టలకు ఏ ఉద్దేశ్యంతో పట్టాలు ఇచ్చారు. పేదలకు ఇల్లు జాగలకు భూమి ఇయ్యడానికి చేతులు ఎకరాల కొద్ది పట్టాలు ఏట్లా ఇచ్చారు? ఎప్పుడు ఇచ్చారు. దీని పై విచారణ జరిపించాలి.

– బండెల హరీశ్, మీర్జాపూర్

భూములు సర్వే చేస్తాం



మా దృష్టికి వచ్చిన కుంటల మరమ్మతుకు గతంలో మిషన్ కాకతీయ కింద పనులు చేయించాం. ఆ కుంటలను ఆక్రమిస్తే సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేస్తాం. కుంటలకు గౌరవెల్లి ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు నింపి పంటలకు కాల్వల ద్వారా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీధర్, ఏఈ, ఇరిగేషన్‌శాఖ, హుస్నాబాద్

ఫిర్యాదులు వస్తే విచారణ



ప్రభుత్వ సీలింగ్ యాక్ట్ ప్రకారం సాగు యోగ్యమైన భూములకు పేదల సంక్షేమం కోసం అసైన్డ్ పట్టాలు ఇస్తారు. హుస్నాబాద్‌లో గుట్టల భూములకు పట్టాలు ఇచ్చినట్లు మాకు తెలిసింది. మెడికల్ కాలేజీ కోసం ప్రభుత్వ భూములు సర్వే చేసినప్పుడు గుట్టల భూములకు పట్టాలు పొందినట్లు మా దృష్టికి తీసుకొచ్చారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి పట్టాల రద్దు కోసం కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్



లైబ్రరీలో విద్యార్థులకు కథలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

విద్యతోపాటు విజ్ఞానం

- సర్కారు స్కూళ్లలో గ్రంథాలయాలు
- వచ్చే నెల నుంచి 30 పాఠశాలల్లో..
- ఒక్కో లైబ్రరీలో 777 రంగుల కథల పుస్తకాలు
- ప్రధానోపాధ్యాయులకు శిక్షణ
- విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యం

జహీరాబాద్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం, రాయడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. 2019 సంవత్సరం నుంచి ఉమ్మడి జిల్లాలో రూమ్ టు రీడ్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేసి విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపేలా కథల పుస్తకాలను సమకూర్చుతోంది. ఈ సంస్థ ఎఫ్ఎల్ఎన్‌కు అనుబంధంగా విద్యాశాఖ సమన్వయంతో ఉమ్మడి జిల్లాలో ఎంచుకున్న పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేస్తోంది. ఆయా పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి పిల్లలలో మౌలిక సామర్థ్యాల అభివృద్ధి, పఠనాభిరుచి కోసం కృషి చేస్తోంది. ఇప్పటి వరకు 120 ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేసి పుస్తకాలను అందుబాటులో ఉంచి ఉపాధ్యాయులతో విద్యార్థులకు కథలు చెబుతున్నారు.

30 ప్రభుత్వ పాఠశాలల్లో..

జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, అందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి మండలాల్లో లైబ్రరీలను అందుబాటులోకి తేనుంది. నవంబర్ నుంచి 30 ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని ప్రధానోపాధ్యాయులకు నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహించారు. రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయడంతోపాటు జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కథల పుస్తకాలను, పఠన సామగ్రిని అందించి గ్రంథాలయాల అభివృద్ధికి పాటు పడుతోంది. తెలుగు భాష బోధన ప్రక్రియలో ఉపాధ్యాయులు బోధన ప్రణాళికలు, విద్యార్థుల వర్క్ బుక్స్ ద్వారా నాణ్యమైన విద్యాబోధనతో విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలు, పఠనాభిరుచి సాధనకు పాటుపడుతోంది.

తల్లిదండ్రులు భాగస్వామ్యం

పిల్లల్లో పఠనాభిరుచి పెంపొందించేందుకు వివిధ రకాల రంగు రంగుల కథల పుస్తకాలను అందుబాటులో ఉంచుతోంది. ప్రతీ పాఠశాల లైబ్రరీలో 777 కథల పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. విద్యార్థులు కథల పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి తల్లిదండ్రుల సహాయంతో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. తీసుకున్న పుస్తకాన్ని వారం రోజుల్లో తిరిగి లైబ్రరీలో అప్పగించాల్సి ఉంటుంది. ఆ తర్వాత విద్యార్థులు మరో పుస్తకాన్ని తీసుకెళ్లాలి.

పఠనాభిరుచి పెంచేందుకే



ప్రాథమిక స్థాయి పిల్లల్లో పఠనాభిరుచి, పఠన సామర్థ్యాలు పెంపొందించేందుకు జిల్లా విద్యాశాఖ సహకారంతో ఈ విద్యాసంవత్సరంలో 30 పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా ప్రాథమిక తరగతుల ఉపాధ్యాయులకు ఇచ్చిన వనరులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించాం.

-పీ.ప్రవీణ్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్

ప్రేమించిన అమ్మాయి గ్రామానికి వచ్చిందని

భయంతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



శ్రీకాంత్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సలాబత్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి కిష్టయ్యకు కుమారుడు శ్రీకాంత్(19), కూతురు ఉన్నారు. శ్రీకాంత్ ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం తల్లిదండ్రులతో కలిసి గ్రామంలోని వ్యవసాయ పొలం వద్ద వరి కోసేందుకు వెళ్లాడు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికిరాగా అతడు మాత్రం తర్వాత వస్తానని చెప్పాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. శ్రీకాంత్‌ను ప్రేమిస్తున్న అమ్మాయి గ్రామానికి వచ్చి కలిసేందుకు ఫోన్ చేయడంతో తల్లిదండ్రులకు ఏం చెప్పాలో తెలియక భయంతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి పేర్కొన్నారు. కిష్టయ్య ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి..

కొండపాక(గజ్వేల్): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పొన్నం కొండయ్య(50) కూతురు పెళ్లి కోసం రూ. 3లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం సేవించి ఊర చెరువు వద్దకు వెళ్లిబట్టలు, సెల్‌ఫోన్‌ను గట్టుపై వదిలి చెరువులో దూకాడు. కొండయ్య వస్తువులు చూసిన గ్రామస్తులు గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులోంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

ములుగులో భూ వివాదం



సర్వే స్థలంలో గ్రామస్తులు

ములుగు(గజ్వేల్): ములుగు మండల కేంద్రంలో భూ వివాదం గొడవకు దారితీసింది. ఆలయానికి సంబంధించిన భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఆ భూమి ఆలయానికే చెందాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తుండటంతో వాగ్వాదం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. ములుగు గ్రామంలోని 203 సర్వే నంబర్‌లో 13 గుంటల భూమి, 210, సర్వే నంబర్‌లో 16 గుంటల భూమి మొత్తం 29 గుంటలు ఉంది. ఈ భూమి గ్రామ కంఠందని, శివాలయానికి చెందినదిగా గ్రామస్తులు పేర్కొంటున్నారు. గోశాల కోసం తామే చదును చేయించామని తెలిపారు. ఇది తమ సొంత పట్టా భూమి అని పట్టాదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై 20 రోజుల కిందట తహసీల్దార్ కార్యాలయంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేయగా గ్రామస్తులకు, రైతులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. సర్వే రిపోర్టులో భూమి ఎవరిదో తేలుతుందని తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రభుత్వ పరిపాలనలో సమగ్రత, పారదర్శకత

సంగారెడ్డి పోస్టల్ డివిజన్ పరిధిలో ర్యాలీ



ర్యాలీ తీస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి: కేంద్ర ప్రభుత్వ పరిపాలనలో సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడానికి విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌ను ప్రతీయేటా నిర్వహిస్తారని సంగారెడ్డి డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎల్‌వీ మురళీ కుమార్ అన్నారు. 28వ తేదీ నుంచి నవంబర్ 3 వరకు సంగారెడ్డి పోస్టల్ డివిజన్ పరిధిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన డివిజన్ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దేశ శ్రేయస్సు సమగ్రత సంస్కృతి కోసం పాటుపడతామని తపాలా ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సంగారెడ్డి బ్రాంచ్ మేనేజర్లు వెంకట్ రావు, కవిత మాట్లాడుతూ నీతి, సుపరిపాలనను ప్రోత్సహించడంలో ప్రతీఒక్కరి బాధ్యత ఉండాలన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ వారోత్సవాల్లో భాగంగా పసలవాడీ గ్రామంలో ర్యాలీ తీసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జహీరాబాద్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రఘువీర్, పోస్ట్ మాస్టర్ సురేశ్, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ గౌడ్, సీపీసీ ఇన్‌చార్జి వనజ, అకౌంటెంట్ నాగరాజు, శ్రావణి, డివిజన్ స్టాఫ్ మహేందర్, శ్రీనివాస్, శివ, రమేశ్, హెడ్ పోస్ట్ మ్యాన్ రామారావు, పోస్ట్ మ్యాన్లు విష్ణు, కుశలయ్య, ఎంటీఎస్‌లు భవానీ, బానోత్ మురళీ, సందీప్, సచిన్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకులు అరెస్ట్

గజ్వేల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం గజ్వేల్ సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజుతో కలిసి మాట్లాడుతూ... ప్రజ్ఞాపూర్‌కు చెందిన మహ్మద్ అష్రఫ్, ఆకాశపు సాయికుమార్ మానస్ వైన్స్ పక్కన మిర్చీబండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి బీహార్‌కు చెందిన రాహుల్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిందన్నారు. రాహుల్ ఇచ్చిన గంజాయిని వీరిద్దరు తాగడంతోపాటు సమీప గ్రామాల్లో కూలీలకు, యువకులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు అష్రఫ్, సాయికుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఇద్దరి వద్ద రూ.7 వేల విలువైన 335 గ్రాముల గంజాయితోపాటు స్కూటీని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తెల్లాపూర్‌లో కిలో పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సంజీత్ కుమార్ జీవనోపాధి కోసం గతేడాది తెల్లాపూర్‌కు వలసొచ్చాడు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఆర్ లేబర్ క్యాంప్ వద్ద చిన్న హోటల్ నిర్వహిస్తున్నాడు. అతడికి పశ్చిమబెంగాల్ చెందిన మనోజ్‌తో స్నేహం ఏర్పడింది. లేబర్‌లు గంజాయి అడుగుతున్నారని తనకు గంజాయి తెచ్చిస్తే అమ్ముకుంటానని మనోజ్‌కు చెప్పాడు. దీంతో అతడు కిలో గంజాయిని రూ.20 వేలకు సంజీత్ కుమార్‌కు ఇవ్వగా విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం రాత్రి సంజీత్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పోలీసుల తీరుపై రఘునందన్‌రావు ఆగ్రహం

ప్రార్థనా మందిరం ధ్వంసంపై ఏడుగురు అరెస్ట్



పోలీసులతో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ భూమిలో ప్రార్థనా మందిరం నిర్మాణం జరుగుతుంటే పట్టించుకోకుండా వ్యక్తులను అరెస్టు చేయడాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తప్పుపట్టారు. ఈ విషయంలో కుకునూరుపల్లి పోలీసులు ప్రవర్తించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సార్లవాడలోని ఓ వర్గపు ప్రార్థనా మందిరంపై కొందరు వ్యక్తులు దాడి చేసి పాక్షికంగా ధ్వంసం చేశారు. ఇందులో భాగంగా కుకునూరుపల్లి పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకొని సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అదే రోజు రాత్రి 11 గంటలకు రిమాండ్ అయిన వారిని బెయిల్‌పై బయటకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి నేరుగా మరికొంత మందితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో ప్రార్థనా మందిరం నిర్మాణం చేస్తున్నా పట్టించుకోకుండా అమాయకులను ఎలా అరెస్టు చేస్తారంటూ పోలీసుల తీరుపై మండిపడ్డారు. గజ్వేల్ ఏసీపీ పురుశోత్తంరెడ్డితోపాటు మరి కొందరు పోలీస్ అధికారులు స్టేషన్‌కు చేరుకున్నారు. మంగళవారం తెల్లవారు జాము వరకు అక్కడే ఉండగా ఎంపీకి, పోలీసులకు స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు.

కానిస్టేబుల్ ఇంటికే కన్నం


బంగారం, వెండి ఆభరణాలు చోరీ



పెద్దశంకరంపేట(మెదక్): కానిస్టేబుల్ ఇంటికే దొంగలు కన్నం వేసి ఆభరణాలతోపాటు నగదు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని శ్రీ వేంకటేశ్వర కాలనీకి చెందిన కానిస్టేబుల్ దంతెల సీమన్ అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లి తిరిగి మంగళవారం ఉదయం ఇంటికొచ్చాడు. ఇంటి తలుపులు వేసినట్లే ఉండగా వెనుక నుంచి ఇంట్లోకి దొంగలు చొరబడి బీరువాలోని 8 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

దీపావళి సెలవులకు ఇంటికొస్తుండగా..

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- విద్యార్థి మృతి, తండ్రికి గాయాలు



ప్రమాద స్థలంలో విద్యార్థి అర్జున్

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన నిజాంపేట మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధిలో జెడ్ చెరువు తండాకు చెందిన రమావత్ శత్రు, శిరీష దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు అర్జున్(13) ఉన్నారు. కామారెడ్డి జిల్లాలోని గాంధారిలో గిరిజన వసతి గృహంలో 6వ తరగతి చదువుతున్నాడు. దీపావళి పండుగకు సెలవులు రావడంతో తండ్రి శత్రు వసతి గృహానికి వెళ్లి బైక్‌పై అర్జున్‌ను ఇంటికి తీసుకొస్తున్నాడు. మండల పరిధిలోని నందిగామ గ్రామ శివారులోకి రాగానే కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థి అర్జున్ అక్కడికక్కడే మృతి చెందాడు. శత్రుకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ..



హరిచంద్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధి రెడ్యా పంచాయతీ రూప్‌సింగ్ తండాకు చెందిన హరిచంద్(71) కొంత కాలంగా గొంతు క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. గొంతు నొప్పి భరించలేక సోమవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఎలుకల మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య హస్లీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు..

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి నీట మునిగి యువకుడు మృతి చెందిన ఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు... నార్సింగి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ షకీల్(25) ప్లంబర్‌గా పనిచేస్తాడు. పని లేని సమయంలో చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం స్నేహితుడు కండ్లకొయ్య అశోక్‌తో కలిసి కాముని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీట మునిగి మృతి చెందగా అశోక్ విషయం కుటుంబ సభ్యులకు చెప్పాడు. కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్ఐ తెలిపారు.

నిజామాబాద్‌లో జిల్లా వాసి మృతి



నాగులు (ఫైల్)

రామాయంపేట(మెదక్): నిజామాబాద్ జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన కూలీ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన గాండ్ల నాగులు (48)కు భార్య వనితతోపాటు ఐదుగురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్యా పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం నిజామాబాద్ జిల్లా ఎరుగట్ల గ్రామానికి వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ అక్కడే స్థిరపడ్డారు. ఈ క్రమంలో పనులు చేసుకొని టీవీఎస్ మోపెడ్‌పై ఇంటికెళ్తుండగా ఎరుగట్ల సమీపంలో కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం రాత్రి ప్రగతి ధర్మారంలో అంత్యక్రియలు నిర్వహించారు.